క్లుప్తంగా

వైభవంగా శివపార్వతుల కల్యాణం



కొత్తకోట: మండలంలోని కానాయపల్లి శివారులో గల శ్రీ కోటిలింగేశ్వరస్వామి ఆలయంలో శివుడి జన్మనక్షత్రమైన ఆరుద్ర నక్షత్రం సందర్భంగా శుక్రవారం శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పుష్యమాసంలో పౌర్ణమి రోజున ఆరుద్ర నక్షత్రం కలిసి రావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో ఆది దంపతుల కల్యాణం జరిపించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ఏకదశ రుద్రాభిషేకం చేసి శ్రీజ్ఞానాంబికాదేవికి ప్రత్యేక పూజలు చేసి కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ వారు భక్తులకు అన్నదానం చేశారు.

పీహెచ్‌సీల్లో సాధారణ కాన్పులకే ప్రాధాన్యం



పాన్‌గల్: పీహెచ్‌సీలో సాధారణ కాన్పులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు పీహెచ్‌సీ డాక్టర్ రాకేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని బుసిరెడ్డిపల్లికి చెందిన రజిత సాధారణ కాన్పులో మగ శిశువుకు జన్మనిచ్చినట్లు డాక్టర్ పేర్కొన్నారు. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారని, బాలింతకు కేసీఆర్ కిట్ అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈనెలలో పీహెచ్‌సీలో ఇది మొదటి కాన్పు అని తెలిపారు. పీహెచ్‌సీలోనే మెరుగైన వైద్యంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతుండడంతో ప్రతి గర్భిణి పీహెచ్‌సీలోనే కాన్పు చేయించుకోవాలని సూచించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



ఖిల్లాఘనపురం: వివేకానంద జయంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు శుక్రవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. యువత దేశ భవిష్యత్ అనే అంశంపై యువశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రాధ మాట్లాడుతూ విద్యార్థులకు స్వామి వివేకానంద చరిత్ర ఒక దిక్సూచి అన్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కాగితాల మధు మాట్లాడుతు దేశం గర్వించదగిన వ్యక్తి వివేకానందుడని కొనియాడారు. ఆయనను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని తెలిపారు.

నర్సరీల నిర్వహణపై ప్రత్యేక దృష్టి



పాన్‌గల్: నర్సరీల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి మొక్కలను పెంచాలని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కేతేపల్లిలో నర్సరీని సందర్శించి మొక్కలను పరిశీలించారు. నర్సరీల బాధ్యత వన సేవకులదేనని పర్యవేక్షణ పంచాయతీ కార్యదర్శులు నిర్వహించాలన్నారు. లక్ష్యం మేరకు మొక్కలను పెంచాలని ఆదేశించారు. నర్సరీల నిర్వహణలో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన సిబ్బందికి హెచ్చరించారు. దీంతో పాటు గ్రామంలో పనిచేసే ఉపాధి కూలీలు జాబ్‌కార్డును ఆధార్‌తో అనుసంధానం చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ కుర్మయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ బీరయ్య, పంచాయతీ కార్యదర్శి జహంగీర్ పాల్గొన్నారు.

వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు

కొత్తకోట: ఇద్దరు ఘర్షణ పడిన ఘటనలో ఓ వ్యక్తికి గాయాలు కావడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసిన సంఘటన శుక్రవారం కొత్తకోట పోలీస్ స్టేషన్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే మండలంలోని విలియంకొండకు చెందిన బి.వంశీకుమార్ ఇంటి సమీపంలో అదే గ్రామానికి చెందిన ముష్టి నరసింహలు మద్యం సేవిస్తుండటంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ గొడవలో నరిసింహ దురుసుగా, అసభ్యకరంగా మాట్లాడుతూ.. వంశీకుమార్‌ను కొట్టినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అభివృద్ధిలో దేశంలోనే అగ్రగామి

- రైతుల బాగుకోసం పనిచేసేది కేసీఆర్ ప్రభుత్వమే
- గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనులు
- ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

పాన్‌గల్: అభివృద్ధి, సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ అహర్నిశలు కృషి చేస్తుండటంతోనే దేశంలోనే మన రాష్ట్రం అగ్రగామిగా నిలిచిందని కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కేతేపల్లి, తెల్లరాళ్లపల్లి, చిక్కేపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించి పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేతేపల్లిలోని భగత్‌సింగ్ నగర్ కాలనీ సమీపంలో బీసీల ప్లాట్ల కోసం కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. స్థలంలో సర్వే చేయడంతో పాటు హద్దులు ఏర్పాటు చేసి లబ్ధిదారులకు ప్లాట్లు కేటాయిస్తామన్నారు. అనంతరం రోడ్ల విస్తరణలో భాగంగా ఇళ్లు కోల్పోతున్న బాధితులతో సమావేశం నిర్వహించారు. రోడ్ల విస్తరణలో ఇళ్లు కోల్పోతున్న వారికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు లేదా రూ.మూడు లక్షలు అందిస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలో రూ. 20 లక్షలతో చేపట్టే డ్రెయినేజీ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. అనంతరం తెల్లరాళ్లపల్లిలోని క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభించారు.

చిక్కేపల్లి రూపురేఖలు మారుతాయి

చిక్కేపల్లిలో చేపట్టే అభివృద్ధి పనులతో గ్రామ రూపు రేఖలు మారుతాయని ఎమ్మెల్యే అన్నారు. గ్రామంలో రూ.1.50 కోట్లతో నిర్మించిన విద్యుత్తు సబ్‌స్టేషన్, రూ.60లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, మన ఊరు-మన బడిలో రూ.16లక్షలతో నిర్మించిన పాఠశాల గదులను ఎమ్మెల్యే ప్రారంభించి, రూ. 10 లక్షలతో నిర్మించే డ్రెయినేజీకి భూమిపూజ నిర్వహించారు. రైతులకు ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతుబీమా, సాగునీరు వంటి పథకాలను అమలు చేస్తూ రైతుల పక్షపాతిగా సీఎం కేసీఆర్ నిలిచారని ఎమ్మెల్యే కొనియాడారు. గ్రామాన్ని ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోనే అగ్రగామిగా తయారు చేస్తున్నారన్నారు. ఈ ఒక్క గ్రామానికి రూ. 9 కోట్లతో అనేక అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి నిధులు

దీంతో పాటు గ్రామానికి యాదవ కమ్యూనిటీ హాల్, మత్స్యకార కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తాననని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, జెడ్పీటీసీ లక్ష్మి, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు మునీరోద్దీన్, రైతుబంధు అధ్యక్షుడు వెంకటయ్యనాయుడు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సోమ్‌నాథ్ నాయక్, విద్యుత్ ఎస్‌ఈ నాగేంద్రకుమార్, ట్రాన్స్‌కో ఏఈ చందన్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్‌లు అనిత, రేణమ్మ, బాలస్వామియాదవ్, ఎంపీటీసీ శ్యామల, తహసీల్దార్ ఏసయ్య, ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం

సీఎం సహాయనిధి పేద వర్గాలకు వరం లాంటిదని కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కేతేపల్లికి చెందిన స్వప్నకు సీఎం సహాయనిధి నుంచి మంజూరయిన రూ.18 వేల చెక్కు, విజయ్‌కు రూ. 16 వేల చెక్కులను ఎమ్మెల్యే బాధితులకు అందజేశారు. సీఎం సహాయనిధి ద్వారా పేద వర్గాలు కార్పొరేటు ఆస్పత్రులల్లో వైద్యం చేయించుకునే అవకాశం కలిగిందన్నారు. పేదల వైద్యానికి సీఎం సహాయనిధి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. దీంతో పాటు మండలంలోని జమ్మాపూర్ గ్రామానికి చెందిన సుజాతకు మంజూరైన రూ. 56 వేల చెక్కును బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు జ్యోతినందన్‌రెడ్డి బాధిత కుటుంబానికి అందజేశారు.

రేషన్ బియ్యం పంపిణీలో కోతలు సరికాదు



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

పాన్‌గల్: రేషన్‌కార్డులో ప్రతి సభ్యుడికి ఇచ్చే బియ్యాన్ని ఆరు కిలోల నుంచి 5 కిలోలకు తగ్గించడం సరికాదని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్ అన్నారు. శుక్రవారం మండలంలోని కేతేపల్లిలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రతి కార్డులో ఐదుగురు సభ్యులు ఉంటే నెలకు 5 కిలోల ప్రకారం ఏడాదికి 60 కిలోలు కోల్పోతారన్నారు. కిలోకి రూ.30 ధర ప్రకారం ఏడాదికి రూ.1,800 నష్టపోతారని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు మనిషికి 5 కిలోలు ఇచ్చేవని, ఆరు కిలోలు ఇస్తామని అధికారంలోకి వచ్చారని ఆయన గుర్తుచేశారు. ఇది ఎన్నికల హామీ నుంచి వెనక్కు తగ్గడమే అన్నారు. పేదలకు ఇచ్చే బియ్యం ఆర్థిక భారంగా భావించడం తగదని హితవు పలికారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గతంలో మాదిరిగానే మనిషికి ఆరు కిలోల బియ్యాన్ని కొనసాగించాలన్నారు. దీంతో పాటు గ్రామంలోని సర్వే నెం. 627లో బీసీల ప్లాట్లకు కేటాయించిన స్థలంలో నెలలోపు హద్దులు ఏర్పాటు చేసి పట్టాలు ఉన్నా వారికి ప్లాట్లు కేటాయిస్తామని కొల్లాపూర్ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి హామీ ఇవ్వడంపై పార్టీ తరఫున హర్షం వ్యక్తం చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు డంగు కుర్మయ్య, లక్ష్మీనారాయణ, కాకం చిన్న నారాయణ, పెద్ద హన్మంతు, చిన్న కుర్మయ్య, భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో తహసీల్దార్ కార్యాలయ భవనం



తహసీల్దార్ కార్యాలయంలో భవనం



పెచ్చులూడుతున్న పైకప్పు

మదనాపురం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి వస్తే జర పైలంగా ఉండాల్సిన అవసరం ఉంది. జిల్లాల పునర్విభజనలో భాగంగా మండలాల ఏర్పాటు సమయంలో ఆగమేఘాల మీద ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మంత్రి నిరంజన్‌రెడ్డి చొరవతో మదనాపురం గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయించారు. అప్పట్లో ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాలు ప్రారంభించేందుకు భవనాలు లేకపోవడంతో అప్పటికే శిథిలావస్థలో ఉన్న పాత పాఠశాల భవనానికి తుది మెరుగులు దిద్ది పాలన ప్రారంభించారు. శిథిలావస్థ భవనంలో కార్యాలయాలు ఏర్పాటై నాలుగేళ్లు దాటినా ఇంకా కొత్త వాటికి గురించి ఆలోచించట్లేదు.

జర పైలం..

తహసీల్దార్ కార్యాలయానికి సంబంధించి వెనక భాగంలో ఉన్న భవనాలు పూర్తిగా శిథిలావస్థలో ఉన్నాయి. పైకప్పులు ఊడిపడడంతో పాటు సీకులు తేలాయి. మొన్న వర్షాకాలంలో ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలకు భవనాల్లో తుంపులు వచ్చాయి. అప్పుడప్పుడు పైకప్పు పెచ్చులు రాలిపడుతున్నాయి. వివిధ పనుల కోసం కార్యాలయానికి వచ్చి న ప్రజలు తమ వ్యక్తిగత కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెనక భాగంలో ఉన్న పాత భవనాల వద్దకు వెళ్తున్నారు. ఈ భవనాలు ఎప్పుడు కూలి పడతాయో తెలియని పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో ప్రమాదవశాత్తు ఏదైనా జరిగితే ఇబ్బందులు తలెత్తే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పాలకులు స్పందించి శిథిలావస్థలో ఉన్న భవనాలను తొలగించి నూతన కార్యాలయాలు నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న పీఆర్టీయూ టీఎస్ నాయకులు

చిన్నంబావి: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం పీఆర్టీయూ టీఎస్ మండల అధ్యక్షుడు మామిళ్లపల్లి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో 2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ సోమేశ్వరమ్మ, జెడ్పీటీసీవెంకట్రామమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ పీఆర్టీయూ టీఎస్ సంఘం కేవలం ఉపాధ్యాయుల సంక్షేమం కోసమే ఏర్పడిందని, 50ఏళ్లుగా ఉపాధ్యాయుల కోసం ఎన్నో జీఓలు ఇప్పించిందని, త్వరలో పెండింగ్‌లో ఉన్న డీఏల మంజూరు, పీఆర్సీ కమీషన్, పదోన్నతులతో కూడిన బదిలీలు, 317 జీఓ, ఉపాధ్యాయుల సమస్యలపై పరిష్కరించే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు సంఘం కృషి చేస్తుందన్నారు. అనంతరం ఎంపీపీ సోమేశ్వరమ్మ మాట్లాడుతూ పీఆర్టీయూ సంఘం ఆధ్వర్యంలో ఎన్నో ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం అయ్యాయన్నారు. జెడ్పీటీసీ వెంకట్రామమ్మ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమమే ఎజెండాగా పీఆర్టీయూ ముందుకెళ్తుందని, యూనియన్‌కి ఎల్లప్పుడు అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో మండల గౌరవాధ్యక్షుడు వెంకటస్వామిరెడ్డి, పెంట్లవెల్లి పీఆర్టీయూ మాజీ అధ్యక్షుడు దగడ ఎల్‌ఎఫ్‌ఎల్ ప్రధానోపాధ్యాయులు రామజన్నారు సింగ్, జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి, జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, సీనియర్ కార్యసభ్యులు బుసిరెడ్డి, మండల కార్యదర్శి హరికుమార్, సభ్యులు వెంకట కృష్ణారెడ్డి, చందులాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు లూయిస్ బ్రెయిలీ

వనపర్తి టౌన్: నాలుగేళ్ల వయస్సులోనే కంటిచూపు కోల్పోయినా.. 17 ఏళ్ల వయస్సుకి ప్రొఫెసర్‌గా ఎదిగి అంధులకు అక్షరజ్ఞానం అందించిన ప్రతిభామూర్తి లూయిస్ బ్రెయిలీని ఆదర్శంగా తీసుకోవాలని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. లూయిస్ బ్రెయిలీ వర్ధంతి సందర్భంగా టీజేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజారామ్ మాట్లాడుతూ.. లూయిస్ బ్రెయిలీ కేవలం చదువుకోవడానికి, రాయడానికి పరిమితం కాకుండా, సంగీతం నేర్చుకునేందుకు కూడా దోహదపడేలా బ్రెయిలీ లిపిని రూపొందించారని గుర్తుచేశారు. ఆత్మవిశ్వాసంతో సాధించాలనే పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చనే దానికి నిదర్శనంగా లూయిస్ బ్రెయిలీని చూపాలన్నారు. కార్యక్రమంలో గిరిరాజా చారి, డాక్టర్ నాయకంటి నరసింహాశర్మ తదితరులు పాల్గొన్నారు.

'భగీరథ' పైప్‌లైన్ మరమ్మతు



అమరచింత: రామన్‌పాడ్ ప్రాజెక్టు వద్ద ఉన్న ఎర్రగట్టు వద్ద ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ పంప్‌హౌజ్ నుంచి గ్రామాలకు తాగునీటిని అందిస్తున్న పైప్‌లైన్ పగిలి పోవడంతో గురువారం నీటి సరఫరాకు అంతరాయం కలిగింది. దీంతో ఎర్రగట్టు పంప్‌హౌజ్ నుంచి అమరచింత, ఆత్మకూర్, మదనాపురం, చింతకుంట మండలాల్లోని 25 గ్రామాలకు నీటి సరఫరా గురువారం నిలిచిపోయింది. మిషన్ భగీరథ అధికారులు సకాలంలో స్పందించి సిబ్బందితో పగిలిన పైప్‌లైన్‌ను మరమ్మతు చేయించడంతో శుక్రవారం ఆయా గ్రామాలకు తాగునీటిని అందించగలిగారు.

ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

కోడేరు: ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ రాజేశ్వర్ అన్నారు. శుక్రవారం మండలంలోని మైలారంలో ఆర్టీసీ సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించకుండా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు. ప్రైవేట్ వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం ద్వారా ప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. ఆర్టీసీ శిక్షణ పొందిన డ్రైవర్లు ఉంటారన్నారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మశన్న, బాల్‌రెడ్డి, రామయ్య, జలేంధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణానది నుంచి ఇసుక అక్రమ రవాణా



రంగాపూర్ శివారులో దంపు చేసిన ఇసుక (ఫైల్)

పెబ్బేరు: మండలంలోని రాంపూర్, రంగాపూర్‌కు చెందిన కొందరు వ్యక్తులు పగలు, రాత్రి తేడా లేకుండా జోరుగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. కృష్ణానది పరివాక ప్రాంతాల్లో కొందరు వ్యక్తులు ముఠాగా ఏర్పడి అర్ధరాత్రి అక్రమ ఇసుక రవాణా వ్యాపారం చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. పగలు కృష్ణానది నుంచి ట్రాక్టర్ల ద్వారా గ్రామాల శివారు ప్రాంతాల్లో డంపులుగా నిల్వ చేసుకొని పగలు లేక అర్ధరాత్రి టిప్పర్ల ద్వారా జోగుళాంబ గద్వాల జిల్లా, హైదరాబాద్ వైపు అనుమతి లేకుండా అక్రమంగా తరలిస్తున్నారు. ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న విషయం పోలీసులకు, మైనింగ్, రెవెన్యూ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని వాదనలు వినిపిస్తున్నాయి. అధికారులకు తెలిసినా నామమాత్రంగా తనిఖీలు చేసి ఇసుక డంపులను సీజ్ చేసినట్లు చూపిస్తారే కానీ ఎవరిపైనా కేసు నమోదు కాలేదు. రెండు, మూడు రోజుల తర్వాత దళారులు ఎప్పటిలాగే ఇసుక డంపులతో వ్యాపారం కొనసాగిస్తున్నారు. సామాన్యులు ఒక ట్రాక్టర్ ఇసుక కావాలంటే అనేక కొర్రీలు పెట్టే అధికారులు అక్రమార్కులను మాత్రం చూసి చూడనట్లు వదిలేస్తున్నారని ప్రజలు మండి పడుతున్నారు. అధికారులు నిర్లక్ష్యం వీడి ఇసుక అక్రమ వ్యాపారం చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



రాంపూర్, రంగాపూర్ గ్రామాల శివారులో ఇసుకను డంపు చేసి అర్ధ రాత్రి అక్రమంగా తరలిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. డంపు చేసిన ఇసుకను సీజ్ చేసి బాధ్యులపై కేసులు నమోదు చేస్తాం.

– రామస్వామి, ఎస్‌ఐ

నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



మాట్లాడుతున్న అఖిలపక్ష నాయకులు

వనపర్తి క్రైం: అమాయక ప్రజలను ఆసరాగా చేసుకొని కొందరు వ్యక్తులు కుంటలో ప్లాట్లు వేసి విక్రయించారని, అది కొన్న అమాయకులు మోసం పోయారని వనపర్తి అఖిలపక్ష ఐక్యవేదిక నాయకుడు సతీష్‌యాదవ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రం సమీపంలోని మర్రికుంట వద్ద ఉన్న కుంటలో అనధికారికంగా ప్లాట్లు వేసి అమాయక ప్రజలకు అంటకట్టారని.. ఇప్పుడు మినీ ట్యాంకు బండ్‌లో అవి పూర్తిగా పోతున్నాయన్నారు. అమాయక ప్రజలను మోసం చేసిన వారిని కఠినంగా శిక్షించి, బాధితులకు డబ్బులు ఇప్పించాలన్నారు. మర్రికుంట నుంచి రాజనగరం చెరువు వరకు ఉన్న కాలువను 20 ఫీట్లకు విస్తరించాలని, లేదంటే వరదకు ఇళ్లలోకి నీరు చేరుకునే ప్రమాదం ఉందన్నారు. సమావేశంలో అఖిలపక్ష నాయకులు వెంకటేష్, రాములు తదితరులు ఉన్నారు.

మొక్కల సంరక్షణ ఏదీ?



ధర్మాపురం, నాగల్‌కడ్మూర్ రహదారి పక్కన మొక్కలు ఇలా..

అమరచింత: ప్రధాన రహదారులకు ఇరువైపులా హరితహారంలో భాగంగా నాటిన మొక్కలకు సంరక్షణ కరువైంది. అధికారుల ఒత్తిడిని తట్టుకోలేక నాటిన మొక్కలకు ట్రీగార్డ్‌లను ఏర్పాటు చేసిన పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు వీటి కోసం ప్రతి నిత్యం నీటిని అందించడం మాత్రం మరిచారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈజీఎస్ ద్వారా గ్రామాల్లో మొక్కల సంరక్షణ కోసం వాచర్లను నియమించిన అధికారులు వారికి వేతనాలు చెల్లించకపోవడంతో.. వారు మొక్కలకు నీటిని అందించే పనులను వదులుకొని వ్యవసాయ కూలీ పనులకు వెళ్తున్నారు. దీంతో సంరక్షించే వారు లేక మొక్కలు వాడుముఖం పడుతున్నాయి. మండలంలోని అన్ని గ్రామాల ప్రధాన రహదారులపై ఎండిన మొక్కలే కనిపిస్తున్నా.. సంబంధిత డీఆర్‌డీఏ అధికారులు పట్టించుకోలేక పోతున్నారు.

నాడు అలా.. నేడు ఇలా..



మరమ్మతు అనంతరం వినియోగంలోకి వచ్చిన వాటర్ ట్యాంక్ వద్ద డీపీఓ సురేష్‌కుమార్

సాక్షి ఎఫెక్ట్..



నిరుపయోగంగా ఉన్న మినీ వాటర్ ట్యాంకు

అమరచింత: 15ఏళ్లుగా నిరుపయోగంగా ఉన్న మినీ వాటర్ ట్యాంక్‌ను అధికారులు ఎట్టకేలకు వినియోగంలోకి తీసుకొచ్చారు. జిల్లా పంచాయతీ అధికారి ప్రత్యేక చొరవతో వారం రోజుల వ్యవధిలోనే నిరుపయోగంగా ఉన్న మినీవాటర్ ట్యాంక్‌ను శుభ్రపరిచి వాటికి పైప్‌లైన్‌తో పాటు కుళాయిలు ఏర్పాటు చేశారు. దీంతో తండా ప్రజలతో పాటు సమీపంలో ఉన్న పాఠశాల విద్యార్థులకు తాగునీటి కష్టాలు తొలగిపోయాయి. మండలంలోని చంద్రనాయక్ తండాలో పాఠశాల ముందున్న మినీ వాటర్ ట్యాంక్ నిరుపయోగంగా ఉండటంతో విద్యార్థులు తాగునీటిని ఇంటి నుంచే తెచ్చుకునేవారు. దీంతో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను డిసెంబర్ 27న సాక్షి దినపత్రికలో మిషన్ భగీరథ నీళ్లేవీ అన్న కథనం ప్రచురితం అయ్యింది. దీంతో డీపీఓ సురేష్ కుమార్ తండాను సందర్శించి వారం రోజుల్లో తాగునీటిని అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు సర్పంచ్ శిల్పా శంకర్‌నాయక్‌తో మాట్లాడి పనులను పూర్తి చేయించారు. శుక్రవారం తండాకు వెళ్లిన డీపీఓ మిని వాటర్ ట్యాంక్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీఓ నరసింహులు, సర్పంచ్ శిల్పాశంకర్ నాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శుభాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించండి

కోడేరు: ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆశా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ ఆశా వర్కర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, హెల్త్‌కార్డులతో పాటు జాయినింగ్ కాపీలను ఇవ్వాలన్నారు.

రోడ్డు మలుపుల వద్ద పంటల నూర్పిళ్లు

అమరచింత: రహదారి మలుపుల వద్ద పంటల నూర్పిళ్లు చేస్తుండటంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదు. మండలంలోని అమరచింత-నర్వ ప్రధాన రహదారిపై ప్రతి పంట సీజన్‌లో రహదారులపై రైతులు పంట నూర్పిళ్లు చేస్తుండడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. నిన్నటి వరకు వరి ధాన్యాన్ని రహదారిపై ఆరబోసిన రైతులు ప్రస్తుతం కందులను ఆరబెట్టడంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళలో రహదారి మలుపుల వద్ద ఉన్న ధాన్యం రాశులను గుర్తించలేక వేగంగా వస్తున్న వాహనాల అదుపు తప్పి ప్రమాదాల బారిన పడక ముందే అధికారులు స్పందించి పంట నూర్పిళ్లను ఆపాలని ప్రయాణికులు కోరుతున్నారు.



నాగల్‌కడ్మూర్ శివారులో రహదారి మలుపు వద్ద ఆరబోసిన కందులు

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99516 02829
మహబూబ్‌నగర్ జిల్లా: 90102 34478, 90105 22215, 97051 35557, 90108 69797, జడ్చర్ల: 90100 76222
నాగర్‌కర్నూల్ జిల్లా: 90100 06785
వనపర్తి జిల్లా: 90100 68317
జోగుళాంబ గద్వాల జిల్లా: 95539 55603
నారాయణపేట జిల్లా: 90109 62007
Office mail : advtmbnr@gmail.com